క్లుప్తంగా

హరీశ్‌రావును కలిసిన డీవీ



మంత్రి హరీశ్‌రావును కలిసిన చైర్మన్ డీవీ

ఇల్లెందు: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావును ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డితో కలిసి మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు శనివారం అసెంబ్లీ ఆవరణలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిని 30 పడకల నుంచి 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట కామేపల్లి బీఆర్‌ఎస్ నేత హనుమంతరావు ఉన్నారు.

గురుకుల ఉపాధ్యాయ పరీక్ష ప్రశాంతం

సుజాతనగర్: అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన తెలంగాణ గురుకుల ఉపాధ్యాయ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మూడు విడతల్లో పరీక్ష నిర్వహించారు. మొత్తం 135 మందికి గాను మొదటి విడతలో 111 మంది, రెండో విడతలో 104 మంది, మూడో విడతలో 102 మంది పరీక్షలకు హాజరయ్యారు. మొత్తం 88 మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

టేకులపల్లి: ఆపదలో ఉన్న ప్రజలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ అన్నారు. టేకులపల్లి మండలంలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే హరిప్రియ ఆదేశాల మేరకు శనివారం టేకులపల్లి, కోయగూడెం, మంగలితండా, రాజుతండా, బిల్లుడుతండా, కొత్తతండాలకు చెందిన లబ్ధిదారుల వద్దకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సర్పంచ్ రతన్, కాలే ప్రసాద్రావు, కుమ్మరి కిరణ్, నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాలను అడ్డుకోవటం తగదు

ఇల్లెందు: ప్రభుత్వ విద్యా సంస్థల్లోకి విద్యార్థి సంఘాలను అనుమతించరాదంటూ రాష్ట్ర పాఠశాల డైరెక్టర్ దేవసేన డీఈఓలకు ఆదేశాలు జారీ చేయటం దుర్మార్గమని పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి గణేష్ తీవ్రంగా ఆక్షేపించారు. శనివారం ఇల్లెందులో ఆయన మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతులను నొక్కి వేయటమేనన్నారు. విద్యార్థి సంఘాలకు అనుమతి లేకుంటే దోపిడీ పెరిగిపోతుందన్నారు. విద్యా సంస్థలలో ఒకపక్క ఆత్మహత్యలు, ఈవిటీజింగ్, ర్యాగింగ్, వేధింపుల సంఘటనలు పెరిగిపోతున్నాయని వాపోయారు. నిధుల దుర్వినియోగం సాగుతోందని, ఇలాంటి తరుణంలో అవి వెలుగు చూడకుండా అనుమతి లేకుండా చేస్తున్నారని ఆరోపించారు.

మస్టర్ రోల్ పరిశీలన

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని సివిల్ డిపార్ట్‌మెంట్‌లో పంప్, వాల్వ్ ఆపరేటర్లు, డిపార్ట్‌మెంట్ ఉద్యోగులను మస్టర్, మెన్ ఆన్ రోల్‌ను కార్పొరేట్ ఏరియా ఆడిట్ అధికారులు శనివారం పరిశీలించారు. ఏరియాలో కొంతమంది ఉద్యోగులు మస్టర్లు పడి విధుల్లో లేకుండా వెళుతున్నారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఏరియాలోని కార్మికుల మస్టర్ రిజిష్టర్‌ను పరిశీలించి వారికి కేటాయించిన విధులు వివరాలు, ఏఏ ఏరియాల్లో పనిచేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వివరాలు, వారికి చెల్లిస్తున్న వేతనాలపై వివరాలు సేకరించారు.

ముగిసిన యోగా శిక్షణ

జూలూరుపాడు: కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తగూడెం శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా మహోత్సవం శనివారం ముగిసింది. హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ వాలంటరీలు ప్రాణాయామం, యోగా ముద్రలు, ధ్యాన సాధనపై అవగాహన కల్పించారు.

వైద్యపరీక్షలు

పాల్వంచరూరల్: జగన్నాథపురం హైస్కూల్‌లో విద్యార్థులకు రాష్ట్రీయ బాలల స్వస్థ కార్యక్రమం (ఆర్‌బీఎస్) ఆధ్వర్యంలో వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలంలో విద్యార్థులకు జ్వరాలు, జలుబు వంటి సీజనల్ వ్యాధులను గుర్తించి మందులు పంపిణీ చేశారు. కళ్ల కలకలు సోకిన విద్యార్థులు పాఠశాలలో ఉంటే వారిని తోటి విద్యార్థులకు దూరంగా ఉంచాలని సూచించారు.

సుజాతనగర్: భవన నిర్మాణ, అసంఘటిత రంగాల్లోని కార్మికులకు సర్వారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సీఎస్‌సీ హెల్త్ కేర్ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ బాదావత్ శారద మాట్లాడుతూ.. కార్మికులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్మికశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిందన్నారు. ఆదివారం సైతం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ అక్బర్ అలీ, క్యాంప్ కోఆర్డినేటర్ జి.మహేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో 'విలీన' నిరసనలు

- డిపోల వద్ద కార్మికుల ఆందోళన
- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు, ఉద్యోగులు
- గవర్నర్ బిల్లును ఆమోదించాలని డిమాండ్



కొత్తగూడెం బస్టాండ్ గేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

చుంచుపల్లి: ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేసేందుకు గవర్నర్ వద్దకు వెళ్లిన బిల్లును వెంటనే ఆమోదం తెలపాలంటూ ఆర్టీసీ కార్మికులు శనివారం ఉదయం డిపోల గేట్ల వద్ద బస్సులను నిలిపివేసి ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ అధికారులతో పాటు పలు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, సిబ్బంది ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. దీంతో ఉదయం పూట జిల్లా కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సు సర్వీసులు నిలిచిపోయాయి.

కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు మూడు డిపోలు, ప్రాంగణాల వద్ద ఆర్టీసీ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బస్సులను బయటకు రాకుండా ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా డిపోలకు చెందిన మేనేజర్లు సైతం పాల్గొని మద్దతుగా నిలిచారు. బస్సులు నిలిచిపోవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, ఉద్యోగులు ఇబ్బందిపడ్డారు. ఇక గురుకుల విద్యాలయాల పోస్టులకు హాజరయ్యే అభ్యర్థులు ముందుగానే మేల్కొని ఆందోళన కంటే ముందే బస్టాండ్‌కు వచ్చి పరీక్ష కేంద్రాలకు వెళ్లారు. నిరసనలో పలువురు కార్మిక సంఘాల నాయకులు, డిపో మేనేజర్లు మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని గవర్నర్ తమిళిసై తక్షణమే బిల్లును ఆమోదించి సహకరించాలని కోరారు. అనంతరం డిపోల పరిధిలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో పలు యూనియన్ నాయకులు, కార్మికులు, సిబ్బంది, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు డిపో మేనేజర్లు బాణాల వెంకటేశ్వరరావు, రామారావు, స్వామి పాల్గొన్నారు.



బస్టాండ్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

వేచిచూడాల్సి వచ్చింది



నేను కొత్తగూడెం నుంచి ఖమ్మం వెళ్లాలని బస్టాండ్‌కు ఉదయం 6.50 గంటలకు వచ్చాను. ఆర్టీసీలో ధర్నా ఉందని తెలియదు. గంట వరకు ఒక్క బస్సు రాలేదు. ఆర్టీసీ కార్మికుల ఆందోళనలు ముగిసేంత వరకు చూడాల్సి వచ్చింది. చాలా మంది పిల్లలతో బస్టాండ్‌లోనే గడిపారు.

– శరత్, ప్రయాణికుడు

బిల్లు ఆమోదించాలని నిరసన



రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు న్యాయం చేసేందుకు సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని ముందుకొచ్చింది. మంత్రి వర్గం ఆమోదించిన బిల్లును గవర్నర్ ఆమోదించాలని కోరుతూ కార్మికులు డిపోల వద్ద నిరసన తెలిపారు. అనంతరం అన్ని ప్రాంతాలకు బస్సులు నడిచాయి.

– బి.వెంకటేశ్వరరావు, డీఎం, కొత్తగూడెం

పేదలకు వైద్యం అందుబాటులో ఉండాలి



వైద్యసిబ్బందికి సామగ్రి అందజేస్తున్న ఎంపీపీ

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం పీహెచ్‌సీలకు అవసరమైన వసతులన్నింటినీ అందుబాటులోకి తెచ్చిందని, వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ పేదలందరికీ వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలని ఎంపీపీ చీమల నాగరత్నమ్మ అన్నారు. మండలంలోని కొమరారం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం డాక్టర్ లోహిత అధ్యక్షతన జరిగింది. మండలంలోని ప్రజాప్రతినిధులు ఆస్పత్రి మొత్తం కలియతిరిగి నూతనంగా అందుబాటులోకి వచ్చిన సామగ్రిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. కొమరారం పీహెచ్‌సీలో మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. సబ్‌సెంటర్‌లలో వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ప్రమోద్, ఎంపీటీసీ ఆజ్మీర బిచ్చా, సర్పంచ్‌లు వాంకుడోత్ సరోజిని, మోకాళ్ల కృష్ణ, బానోత్ సంతు పాల్గొన్నారు.

ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాలి



అమరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకై ప్రాణాలు అర్పించిన రాంచందర్, దస్తగిరి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు వి.శాంతిరామ్ డిమాండ్ చేశారు. శనివారం బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. శాంతిరామ్ మాట్లాడుతూ.. ఆగస్టు 5, 1969లో కొత్తగూడెంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో రాంచందర్, దస్తగిరి మరణించినట్లు చెప్పారు. వారి కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాల, పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఆగస్టు 5వ తేదీని తెలంగాణ అమరవీరుల దినోత్సవంగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్.అనంతరెడ్డి, శంకర్, చింతల చెర్వు గెర్షోము, ఎండీ గౌస్, మంగపతిరావు, సారయ్య, జోగు రామ్మూర్తి, వెంకట్రామయ్య, నాగభూషణం, నరసింహారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పార్క్‌ను అమరవీరుల స్మృతివనంగా ప్రకటించండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌ని చిల్డ్రన్స్ పార్క్‌ను అమరవీరుల స్మృతివనంగా ప్రకటించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ కోరారు. శనివారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం జీఎం వెల్ఫేర్ కట్టా బసవయ్యకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమంలో కొత్తగూడెం ప్రాంతంలో సింగరేణి కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలలో పాల్గొన్నట్లు చెప్పారు. వారి మృతికి చిహ్నంగా చిల్డ్రన్స్ పార్క్‌ను స్మృతివనంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జున్‌రావు, మాలోత్ వీరు, చెనిగరపు నిరంజన్ కుమార్, సిద్దంకి మల్లేష్ పాల్గొన్నారు.


ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



మాట్లాడుతున్న సీడీపీఓ లెనీనా స్వర్ణలత

కొత్తగూడెంటౌన్: ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కొత్తగూడెంలో పలుచోట్ల శనివారం గర్భిణులకు సీమంతం, పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. జిల్లా సంక్షేమశాఖ ఐసీడీఎస్ పరిధిలోని కొత్తగూడెం అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని పాత కొత్తగూడెం సెక్టార్, రామవరం అంగన్‌వాడీ సెంటర్‌లో సీడీపీఓ లెనీనా స్వర్ణలత పాల్గొని మాట్లాడారు. ప్రతిబిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష అని, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లిపాలను తప్పక పట్టించాలన్నారు. పాత కొత్తగూడెం సెక్టార్‌లో 2 వార్డు కౌన్సిలర్, అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం, పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. స్నేహలతా–స్వర్ణలత అనాథాశ్రమంలో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీను, వార్డు కౌన్సిలర్ దామోదార్, సూపర్‌వైజర్ ఉమ, అంగన్‌వాడీ టీచర్లు గోనే మణి, ప్రమీల ఆయాలు పాల్గొన్నారు. కొత్తగూడెం అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని రామవరం అంగన్‌వాడీ సెంటర్లలో ప్రపంచ తల్లిపాల వారోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీడీపీఓ లెనీనా స్వర్ణలత పాల్గొన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు మునిగడప పద్మ, మోరె రూప, కూరపాటి విజయలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీత, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వంటావార్పు



పాల్వంచరూరల్: దీక్ష చేస్తున్న కార్మికులు

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ సిబ్బంది స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపటిన దీక్షలు 31రోజులుగా కొనసాగుతున్నాయి.శనివారం దీక్షలో పంచాయతీ సిబ్బంది రెడ్డిమళ్ల బిక్షం,నల్లమోతుల పూర్ణ, నిరుడు, చందర్ రావు, లింగమనేని బాలకృష్ణ, లెనిన్ కుమార్, కాల్తీరాము,పాటి రవి,శ్రీను కూర్చున్నారు.

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నెల రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ గ్రామపంచాయతీ కార్మికులు శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పక్షాల నాయకులు ఆవునూరి మధు, జె.సీతారామయ్య, యాకూబ్‌షావలీ, రాంసింగ్, సారంగపాణి మాట్లాడుతూ.. నెల రోజులుగా కార్మికులు పట్టుదలతో చేస్తున్న ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు కార్మిక సంఘాలు సిద్ధంగా ఉన్నాయని గుర్తుచేశారు. ప్రభుత్వం తక్షణం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జటంగి వెంకన్న, సామేలు, మోహన్‌రావు, నర్సింహారావు, గోపి, కిరణ్ పాల్గొన్నారు.

వితరణ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం సింగరేణి ప్రధానాస్పత్రి ఏరియాకి చెందిన ఆటో డ్రైవర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబం గడవటం కష్టంగా ఉందని ఆటో డ్రైవర్ల సంఘం సభ్యులు కృష్ణ సమాచారంతో రామవరంలోని మోడ్రన్ ఇఖ్రా స్కూల్ విద్యార్థులు శనివారం బియ్యం, రెండు వేల రూపాయలు సహాయంగా అందజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొత్తగూడెంఅర్బన్: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని 50 స్టేషన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం ఢిల్లీ నుంచి వర్చువల్‌లో చేయనున్నారని భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ అధికారులు శనివారం తెలిపారు. ఇందులో భాగంగా భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.24.40 కోట్లు నిధులు కేటాయించగా, శంకుస్థాపన కార్యక్రమాన్ని వీక్షించేందుకు రైల్వే స్టేషన్‌లో అధికారులు ఏర్పాట్లు చేశారు.

'మధ్యాహ్న'ం ఘర్షణ

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు చేయకుండా పాత కార్మికులను కొత్తవారు అడ్డుకున్నారు. కొద్దిసేపు ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. ఈ విషయంపై ఇరుపక్షాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకున్నారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం



జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల, ఎంపీపీ శాంతిని సన్మానిస్తున్న అధికారులు

చుంచుపల్లి: నాలుగేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా జెడ్పీ వైస్ చెర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఎంపీపీ బాదావత్ శాంతిలను శనివారం చుంచుపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పలువురు అధికారులు ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ మందా మంగమ్మ, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, బాదావత్ సీతారాములు, సీనియర్ అసిస్టెంట్ ఎండీ జానీపాషా, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికి కటకట

టేకులపల్లి: టేకులపల్లి పంచాయతీ ఒకటో వార్డులోని మాంటిస్సోరి స్కూల్, సొసైటీ కార్యాలయం, టీచర్స్ కాలనీల్లో వారం రోజుల నుంచి తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నీటి సరఫరా చేసే బోరు మోటారు మరమ్మతులకు గురైంది. అధికారులు వెంటనే స్పందించి బోరు మోటారుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

కార్పెట్ విరాళం

సుజాతనగర్: తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ విద్యానగర్ వారి ఆధ్వర్యంలో పాత అంజనాపురం ప్రభుత్వ పాఠశాలలో రూ.8 వేల విలువ చేసే కార్పెట్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తూము వెంకటనగేష్, సంధ్య దంపతులు, గుత్తా విజయ్‌కుమార్‌ల ఆర్థిక సహకారంతో కార్పెట్‌ను పంపిణీ చేసినట్లు తెలిపారు. సురేష్ కుమార్, డాక్టర్ రాఘవరావు, ధర్మారావు, విజయమోహన్, సోందుబాబు పాల్గొన్నారు.

జీపీఎఫ్ సమస్యలు పరిష్కరించండి



జెడ్పీ సీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

చుంచుపల్లి: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట జెడ్పీ జీపీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని శనివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుమ్మడి సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి హరిలాల్ మాట్లాడుతూ.. సాధారణ భవిష్యత్ నిధిపై ఉన్న ఆర్థిక ఆంక్షలు తొలగించాలని, పెండింగ్ లోన్లు, పార్ట్ ఫైనల్స్, ఫైనల్ పేమెంట్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2006 జెడ్పీ జీపీఎఫ్‌కు ప్రభుత్వం చెల్లించాల్సిన వడ్డీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా జెడ్పీ జీపీఎఫ్ ఖాతాలలో మిస్సింగ్ క్రెడిట్‌గా ఉన్న సుమారు రూ.1000 కోట్లను ఉపాధ్యాయుల ఖాతాలలో జమ చేయాలనున్నారు. కార్యక్రమంలో వి.సరియా, జోగా రాంబాబు, టి.సత్తిబాబు, బి.రమేష్, బి.బాలు, కె.వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వర్లు, పి.రామనాథం తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలు ఉద్యమించాలి



మాట్లాడుతున్న సీతారామయ్య

టేకులపల్లి: మనుగడ కోసం, హక్కుల సాధనకై ఆదివాసీలు ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.సీతారామయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం మండలంలోని బద్దుతండాలో జరిగిన న్యూడెమోక్రసీ, ఇఫ్టూ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అడవుల దురాక్రమణకు ఆదివాసీలపై అప్రకటిత యుద్ధం చేస్తున్న మోదీ, పోడుపట్టాల పేరుతో ఊరించి మోసం చేసిన కేసీఆర్ విధానాలను ఎండగడుతూ ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8న న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఇల్లెందులో జరిగే ఆదివాసీ దినోత్సవ ర్యాలీ, సభను జయప్రదం చేయాలని కోరారు. అడవులపై కన్నేసిన కార్పొరేట్ సంస్థలకు సంపదను దోచి పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చట్టాలను సవరణల పేరుతో మార్పు చేసిందన్నారు. పోడు భూములకు పట్టాలిస్తానని తొమ్మిదేళ్లుగా నమ్మించిన కేసీఆర్ నేడు 12.50 లక్షల భూములకుగాను నాలుగు లక్షలకే ఇచ్చి చేతులు దులుపుకున్నాడని విమర్శించారు. 2016లో రోళ్లపాడు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సందర్భంలో జిల్లాలోని అన్ని మండలాలకు నియోజకవర్గంలోని మండలాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారని జిల్లాలోని గోదావరి నీళ్లను ఖమ్మం జిల్లా మీదుగా ఆంధ్రా ప్రాంతానికి తరలించే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో భూక్యా హర్ష్య, నోముల భానుచందర్, భూక్యా లక్ష్మణ్, కిషన్, వడిత్యా, నర్సింగ్, జంబూ, ఈర్యా, పంతులు, సురేష్, కోట్యా పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న వంశీ

ఇల్లెందురూరల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తామని పీడీఎస్‌యూ మండల శాఖ అధ్యక్షుడు ధరావత్ వంశీ అన్నారు. మండలంలోని పోలారంలో శనివారం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో అసెంబ్లీలో పోలీసులు విద్యార్థులపై లాఠీ చార్జీ చేయడం అమానుషమన్నారు. ప్రభుత్వం ఉద్యమాలను అణగదొక్కే ప్రయత్నం చేస్తే మరింత ఉధృతమవుతాయన్నారు. అరెస్టు చేసిన పీడీఎస్‌యూ నాయకులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఇర్ప రాకేష్, శ్రీను మాట్లాడారు.

మణిపూర్ ఘటన బాధ్యత ప్రధాని మోదీదే



మాట్లాడుతున్న అనురాధ

ఇల్లెందురూరల్: మణిపూర్ ఘటన ఒక ప్రథకం ప్రకారం జరిగిందని, సభ్యసమాజం తలదించుకునేలా జరిగిన ఈ ఘటనకు ప్రధాని మోదీ బాధ్యత వహించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనురాధ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాదంశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం ఇల్లెందులో జరిగింది. మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ ప్రభుత్వం మతోన్మాద శక్తులకు ఆధిపత్యాన్ని కట్టబెట్టేందుకు చేసిన కుట్ర ఫలితమే ఇది అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రూ.50వేల కోట్ల ఆస్తులు కలిగి ఉన్న ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామనడం హర్షణీయమే అయినా కార్మికుల హక్కులకు భంగం వాటిల్లిందని, ఆర్టీసీ ఆస్తులకు రక్షణ కల్పిస్తామని ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. 32 రోజులుగా గ్రామపంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. సమావేశంలో క్రాంతికుమార్, ఉపేందర్, నరేష్‌కుమార్, బాలమల్లు, ఉమ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ హక్కులను అడ్డుకుంటున్నారు

జూలూరుపాడు: మైదాన ప్రాంతాల రాజకీయ నాయకులు వచ్చి వైరా నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేయడంతో తమ రాజకీయ హక్కులను కాలరాస్తున్నారని బహుజన ముక్తి పార్టీ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ లకావత్ నాగేశ్వరరావు ఆరోపించారు. శనివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. వైరా ఎమ్మెల్యేలుగా గెలుపొందిన బానోత్ చంద్రావతి, బానోత్ మదన్‌లాల్‌లు వైరా నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి ఏమీ చేయలేదని, సవతి తల్లి ప్రేమ చూపించారని విమర్శించారు. ఇతర ప్రాంతాల వారు ఎమ్మెల్యేలుగా గెలవడం వల్ల వైరా నియోజకవర్గ ప్రజల సమస్యలు ఎలా తెలుస్తాయని, స్థానికులు గెలిస్తే అభివృద్ధికి బాటలు వేస్తారన్నారు.

భారీవర్షాలకు దెబ్బతిన్న రోడ్లు



కోతకు గురైన సోములగూడెం రోడ్డు

పాల్వంచరూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు రూ.లక్షల వ్యయం చేసి నిర్మించిన రహదారులు దెబ్బతినడంతో రాకపోకలకు ప్రమాదకరంగా మారాయి. మండల పరిధిలోని సోములగూడెం నుంచి బిక్కుతండా వరకు గత వేసవికాలంలో నిర్మించిన తారు రోడ్డు బూడిదవాగు పొంగిపొర్లడంతో కోతకు గురైంది. కేటీపీఎస్ ఐదో దశ ప్రధాన గేటు నుంచి సూరారం వైపు వెళ్లే ప్రధాన రహదారిపై కిలోమీటరు పొడవున పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై బూడదను తరలించే భారీ కంటెయినర్ వాహనాలు నిత్యం తిరగడం వలన రోడ్డు దెబ్బతిని రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి ఈ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనాదారులు, స్థానికులు కోరుతున్నారు.



అటెన్షన్ ప్లీజ్

రోడ్డుకు మోక్షం లేదా...?



టేకులపల్లి మండలం కొత్తతండా(పి)లో నూతనంగా నిర్మించిన రామాంజనేయ ఆలయానికి దారి లేదు. స్థానికులు పంట పొలాలకు వెళ్లాలంటే నానా తంటాలు పడాల్సిందే. శుభకార్యాలు, ప్రత్యేక పూజలు చేసుకునే భక్తులు గుడికి వెళ్లేందుకు దారి లేక అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే ఈ మార్గంలో బురద కారణంగా వ్యవసాయ పనుల కోసం వెళ్లే రైతుల పరిస్థితి దారుణం. ఉన్నతాధికారులు రామాంజనేయ ఆలయానికి, పంట పొలాలకు వెళ్లేందుకు పక్కా రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

- టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : కోట వీరబాబు, ఎంపీడీఓ, టేకులపల్లి
సెల్ నెంబర్: 9281479238

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ -79979 58226 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148